క్లుప్తంగా

అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జిగా హరీష్‌బాబు


హరీష్‌బాబు

దేవరకొండ: దేవరకొండ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జిగా కొమ్మవరపు వెంకటసాయి హరీష్‌బాబు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన జడ్జి ఉల్లం అజయ్‌కుమార్ మంచిర్యాలకు బదిలీపై వెళ్లడంతో ఆయన స్థానంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లాలోని నకరికల్లుకు చెందిన హరీష్‌బాబు బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆయన ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి పి. రవీందర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ న్యాయవాదులు హరీష్‌బాబును ఘనంగా సన్మానించారు.

అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా శ్రీనివాస్‌యాదవ్


నియామక పత్రం అందుకుంటున్న శ్రీనివాస్‌యాదవ్

త్రిపురారం: మండలంలోని బొర్రాయిపాలెం గ్రామ పంచాయతీకి చెందిన న్యాయవాది పెద్దబోయిన శ్రీనివాస్‌యాదవ్ నిడమనూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వ న్యాయ శాఖ సెక్రటరీ తిరుపతి చేతుల మీదుగా బుధవారం ఆయన హైదరాబాద్‌లో నియామక ఉత్తర్వులు అందుకున్నారు. తన నియామకానికి సహకరించిన మంత్రి జగదీష్‌రెడ్డి, నాగార్జునసాగర్ ఎమ్మెల్యే నోముల భగత్, ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డికి శ్రీనివాస్‌యాదవ్ కృతజ్ఞతలు తెలిపారు.

అదనపు న్యాయమూర్తిగా అపూర్వ రవళి

మిర్యాలగూడ టౌన్: మిర్యాలగూడ రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా ఎన్. అపూర్వ రవళి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన వినుకొండ మాధవి ఖమ్మం బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అపూర్వ రవళికి స్వాగత కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో 5వ అదనపు జిల్లా న్యాయమూర్తి కవిత, సీనియర్ సివిల్ జడ్జి బి. సుజయ్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎ. స్వర్ణలత, మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి బీఎస్ఎన్ సుమబాల, బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కె. శ్రీనివాస్‌రెడ్డి, వాకిటి శ్రీనివాస్, బార్ అసోసియేషన్ సభ్యులు, జూనియర్, సీనియర్ న్యాయవాదులు తదితరులున్నారు.

ఎంసీపీఐ(యూ) ఎమ్మెల్యే అభ్యర్థిగా వస్కుల గోపి


వస్కుల గోపిని సత్కరిస్తున్న నాయకులు

మిర్యాలగూడ అర్బన్: ఎంసీపీఐ(యూ) మిర్యాలగూడ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా వస్కుల గోపిని ఎంపిక చేసినట్లు బహుజన లెఫ్ట్ ఫ్రంట్(బీఎల్ఎఫ్) రాష్ట్ర చైర్మన్ నల్ల సూర్యప్రకాశ్, ఎంసీపీఐ(యూ) కేంద్ర కమిటీ సభ్యుడు వరికుప్పల వెంకన్న తెలిపారు. బుధవారం మిర్యాలగూడ పట్టణంలో నిర్వహించిన సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఎల్ఎఫ్ నాయకులు నల్ల సూర్యప్రకాశ్, వనం సుధాకర్, ఎంసీపీఐ(యూ) నాయకులు వస్కుల సైదమ్మ, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వస్కుల మట్టయ్య తదితరులున్నారు.

దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలు

- మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి

దేవరకొండ: దేశంలోని ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణలో సీఎం కేసీఆర్ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. బుధవారం దేవరకొండ మండలంలో 544 డబుల్ బెడ్‌రూం ఇళ్లను రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్, దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్‌తో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హుల ఎంపికలో పారదర్శకత పాటించి అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందిస్తున్నట్లు తెలిపారు. నల్లగొండ జిల్లాను పట్టి పీడించిన ఫ్లోరోసిస్ భూతాన్ని ఐదేళ్లలో తెలంగాణ ప్రభుత్వం తరిమికొట్టిందని అన్నారు.అనంతరం రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్, ఎమ్మెల్యే రవీంద్రకుమార్ మాట్లాడుతూ.. గడిచిన 60 ఏళ్లలో ఏ ప్రభుత్వం చేయని అభివృద్ధి కేవలం 9ఏళ్లలో తెలంగాణ ప్రభుత్వం చేసి చూపించిందన్నారు. అనంతరం దేవరకొండ మండల పరిధిలోని పెంచికల్‌పహాడ్‌లో నిర్మించిన అవుట్ డోర్ స్టేడియాన్ని మంత్రి ప్రారంభించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు శ్రీనివాస్, హేమంత్‌పాటిల్, ఆర్డీఓ శ్రీరాములు, ఎంపీపీ మాధవరం సునీత, జెడ్పీటీసీ అరుణ, వైస్ చైర్మన్ రహత్‌అలీ, వైస్ ఎంపీపీ చింతపల్లి సుభాష్, పల్లా ప్రవీణ్‌రెడ్డి, టీవీఎన్ రెడ్డి, స్థానిక సర్పంచ్ విద్యావతి, అధికారులు, దేవరకొండ మున్సిపల్ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, ఎంపీపీ నల్లగాసు జాన్‌యాదవ్ దూరంగా ఉన్నారు.


డబుల్ బెడ్‌రూం ఇళ్ల పైలాన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి జగదీష్‌రెడ్డి, ఎంపీ, ఎమ్మెల్యే తదితరులు

పులిచర్ల మండలం ఏర్పాటు చేయాలని వినతి

పెద్దవూర: మండలంలోని పులిచర్ల గ్రామాన్ని నూతన మండలంగా ఏర్పాటు చేయాలని రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డికి పులిచర్ల మండల సాధన సమితి ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. బుధవారం నూతనంగా ఏర్పడిన గుడిపల్లి మండలాన్ని ప్రారంభించటానికి వచ్చిన మంత్రి జగదీష్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించారని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు దేవసాని శ్రీనివాస్‌రెడ్డి, రమావత్ రవినాయక్, బొడ్డుపల్లి చిరంజీవి, బి. లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే సీఎం కేసీఆర్ లక్ష్యం

- శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

మిర్యాలగూడ: గ్రామాల అభివృద్ధే సీఎం కేసీఆర్ లక్ష్యమని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం మిర్యాలగూడ మండలంలోని కాల్వపల్లి, సుబ్బారెడ్డిగూడెం గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని, సుబ్బారెడ్డిగూడెంలో రూ.80లక్షలతో చేపట్టిన రోడ్ల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు, ఆగ్రోస్ చైర్మన్ తిప్పన విజయసింహారెడ్డితో కలిసి గుత్తా శంకుస్థాపన చేసి మాట్లాడారు. అనంతరం మహిళలకు బతుకమ్మ చీరలు పంపిణీ చేశారు. అందచేశారు. కార్యక్రమంలో రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీపీ నూకల సరళ, మార్కెట్ కమిటీ చైర్మన్ బైరం బుచ్చయ్య, వైస్ చైర్మన్ కుందూరు వీరకోటిరెడ్డి, ఎంపీడీఓ గార్లపాటి జ్యోతిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌బీఆర్ ఫౌండేషన్ సేవలు అభినందనీయం

మిర్యాలగూడ ప్రజలకు ఎన్‌బీఆర్ ఫౌండేషన్ అందిస్తున్న సేవలు అభినందనీయమని గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. మిర్యాలగూడ పట్టణంలోని నందిపాడు టీఎస్ఆర్ గార్డెన్‌లో తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్, ఎన్‌బీఆర్ ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహిస్తున్న మెగా జాబ్ మేళాను ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావుతో కలిసి గుత్తా ప్రారంభించి మాట్లాడారు. ఎన్‌బీఆర్ ఫౌండేషన్ చైర్మన్ నల్లమోతు సిద్దార్థ మిర్యాలగూడ నియోజకవర్గంలో జాబ్ మేళాలు నిర్వహిస్తూ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారని అన్నారు. 25 కంపెనీలతో జాబ్ మేళా నిర్వహించినట్లు తెలిపారు.


కాల్వపల్లిలో గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న గుత్తా, ఎమ్మెల్యే భాస్కర్‌రావు

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

కొండమల్లేపల్లి: అభివృద్ధి, సంక్షేమమే బీఆర్ఎస్ ప్రభుత్వ ధ్యేయమని దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. బుధవారం కొండమల్లేపల్లి మండల కేంద్రంలో రూ.90లక్షలతో నిర్మించిన మార్కెట్‌ను, హైదరాబాద్ రోడ్డులో రూ.57లక్షలతో ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్‌ను, రూ.40లక్షలతో నిర్మించిన శ్రీశక్తి భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచ్ కుంభం శ్రీనివాస్‌గౌడ్, మేకల శ్రీనివాస్‌యాదవ్, కేసాని లింగారెడ్డి, యుగంధర్‌రెడ్డి, గంధం సురేష్, దస్రునాయక్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన..

పెద్దఅడిశర్లపల్లి: మండలంలోని ఎర్రగుంటతండా, చింతల్‌తండాలలో రూ.4.1కోట్లతో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు బుధవారం దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ వంగాల ప్రతాపరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ వల్లపురెడ్డి, బీఆర్ఎస్ మండల కార్యదర్శి పరమేష్, సర్పంచులు తదితరులున్నారు.


కొండమల్లేపల్లిలో సెంట్రల్ లైటింగ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రకుమార్

గణిత ఉపాధ్యాయుడిని నియమించాలని ధర్నా

కొండమల్లేపల్లి: మండలంలోని చింతకుంట్ల జెడ్పీహెచ్ఎస్‌లో గణిత ఉపాధ్యాయుడిని నియమించాలని బుధవారం విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాఠశాలకు తాళం వేసి ధర్నా చేపట్టారు. గణిత ఉపాధ్యాయుడు లేకపోవడంతో గతేడాది పదో తరగతి పరీక్షల్లో గణితం సబ్జెక్ట్‌లో చాలామంది ఫెయిల్ అయ్యారని పేర్కొన్నారు. విద్యాశాఖ స్పందించి గణిత ఉపాధ్యాయుడిని నియమించాలని కోరారు.

త్వరలోనే ఉపాధ్యాయుడిని కేటాయిస్తారు – శోభారాణి, హెచ్ఎం

కరోనా ముందు వరకు పాఠశాలలో ఏడుగురు ఉపాధ్యాయులు ఉండేవారు. 317 జీఓ ప్రకారం కొంత మంది బదిలీ అయ్యారు. ఈ క్రమంలోనే గణిత ఉపాధ్యాయుడి పోస్టు ఖాళీగా ఉంది. ఈ విషయాన్ని ఎంఈఓ దృష్టికి తీసుకెళ్లాం. త్వరలోనే జరగనున్న బదిలీల్లో గణితం టీచర్‌ను నియమించనున్నారు.


ధర్నా చేస్తున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు

ముఖ్యమంత్రి కేసీఆర్ నిత్య కృషీవలుడు

నాగార్జునసాగర్: సీఎం కేసీఆర్ పేదల సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి కోసం అనునిత్యం కృషిచేస్తున్నారని నాగార్జునసాగర్ ఎమ్మెల్యే నోముల భగత్ అన్నారు. బుధవారం నందికొండ మున్సిపాలిటీలో జీఓ నంబర్ 58 ప్రకారం ఇల్లు క్రమబద్ధీకరించిన 258 మందికి హిల్‌కాలనీలోని రెడ్డి ఫంక్షన్ హాల్‌లో ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. అదేవిధంగా పెద్దవూర మండలం పోతునూరులోని షెడ్యూల్డ్ కులాల నిరుపేదలకు 58మందికి ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. తుంగతుర్తి, పోతునూరు, నిమ్మానాయక్‌తండా గ్రామాల మహిళలకు బతుకమ్మ చీరలు, సీఎం కేసీఆర్ స్పోర్ట్స్ కిట్స్, టీషర్ట్స్ అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ చైర్‌పర్సన్ కర్ణ అనూష, రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ ఇస్లావత్ రామచంద్రనాయక్, జెడ్పీ వైస్ చైర్మన్ ఇరిగి పెద్దులు, పెద్దవూర జెడ్పీటీసీ అబ్బిడి కృష్ణారెడ్డి, హాలియా, నిడమనూరు మార్కెట్ కమిటీ చైర్మన్లు జువ్వాజి వెంకటేశ్వర్లు, మర్ల చంద్రారెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కర్ణ బ్రహ్మానందరెడ్డి, సాదం సంపత్‌కుమార్, మున్సిపాలిటీ వైస్ చైర్మన్ బిన్ని, కౌన్సిలర్ మంగ్తానాయక్, పీఏసీఎస్ చైర్మన్ గుంటుక వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే భగత్

బాలికలు క్రీడల్లోనూ రాణించాలి

బాలికలు క్రీడల్లోనూ రాణించాలని ఎమ్మెల్యే భగత్ అన్నారు. నెట్‌బాల్ అసోషియేషన్ ఆఫ్ తెలంగాణ, సెయింట్ జోసెఫ్ స్కూల్ ఆధ్వర్యంలో నిర్వహించిన 6వ రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీల్లో పతకాలు సాధించిన విద్యార్థులకు నాగార్జునసాగర్‌లోని సెయింట్ జోసెఫ్ పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభకు ఎమ్మెల్యే హాజరై క్రీడాకారులకు షీల్డ్స్, సర్టిఫికెట్స్ అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ అబ్బిడి కృష్ణారెడ్డి, రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ రామచంద్రనాయక్, మున్సిపాలిటీ చైర్‌పర్సన్ కర్ణ అనూషారెడ్డి, వైస్ చైర్మన్ బిన్ని, టీచర్లు పాల్గొన్నారు.

టీఎస్‌పీఎస్సీని రద్దు చేయాలి

మిర్యాలగూడ: రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీఎస్‌పీఎస్సీ)ను రద్దు చేయాలని, అదేవిధంగా 13వేల పోస్టులతో మెగా డీఎస్సీని ప్రకటించాలని యువజన కాంగ్రెస్ మిర్యాలగూడ నియోజకవర్గ అధ్యక్షుడు షేక్ అజారొద్దీన్ అన్నారు. గ్రూప్–1 ప్రిలిమ్స్ నిర్వహణలో రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాన్ని ఎండగడుతూ బుధవారం మిర్యాలగూడ పట్టణంలోని ఫ్లైఓవర్‌పై సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మకు యువజన కాంగ్రెస్ నాయకులు ఉరి వేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏళ్ల తరబడి కుర్చీలకు అంకితమై ప్రభుత్వ కొలువులు తెచ్చుకుందామని పరీక్షలు రాస్తే వారి ఆశలపై ప్రభుత్వం నీళ్లు చల్లుతోందని అన్నారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించలేని టీఎస్‌పీఎస్సీని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాతంగి సంజయ్, షేక్ సికిందర్, గంగరాజు, సైదులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అనుచిత వ్యాఖ్యలపై నిరసనలు


వేములపల్లి: తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కాంగ్రెస్ నాయకులు


దామరచర్లలో ఎమ్మెల్యే భాస్కర్‌రావు దిష్టిబొమ్మ దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

వేములపల్లి: గృహలక్ష్మి పథకంలో తన పేరు ఎందుకు లేదని అడిగిన వేములపల్లి మండలంలోని శెట్టిపాలెం గ్రామానికి చెందిన వనం విజయను మిర్యాలగూడ ఎమ్మెల్యే భాస్కర్‌రావు దుర్భాషలాడిన విషయం తెలుసుకున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు కంకణాల శ్రీధర్‌రెడ్డి బుధవారం బాధితురాలు ఇంటికి వెళ్లి పరామర్శించి మాట్లాడారు. విజయకు ఎమ్మెల్యే భాస్కర్‌రావు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ మిర్యాలగూడ నియోజకవర్గ కన్వీనర్ రతన్‌సింగ్, జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు చలమల్ల సీతారాంరెడ్డి, జిల్లా మహిళ మోర్చా అధ్యక్షురాలు కొండేటి సరిత, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎడ్ల రమేష్, మండల పార్టీ అధ్యక్షుడు చిర్ర సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా..

శెట్టిపాలెం గ్రామంలో ఎంపీపీ పుట్టల సునీత, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తమ్ముడబోయిన అర్జున్ తదితరులు ఎమ్మెల్యే దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టి అనంతరం కార్యాలయంలో వినతిపత్రం అందచేశారు. అనంతరం నార్కట్‌పల్లి– అద్దంకి రహదారిపై రాస్తారోకో చేపట్టారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మాలి కాంతారెడ్డి, పట్టణ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్‌రెడ్డి, పల్లా వీరయ్య, రావు ఎల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే దిష్టిబొమ్మ దహనం..

మిర్యాలగూడ: ఎమ్మెల్యే భాస్కర్‌రావు దిష్టిబొమ్మకు దామచర్ల మండల కేంద్రంలో బుధవారం కాంగ్రెస్ నాయకులు శవయాత్ర నిర్వహించి దహనం చేశారు. గృహలక్ష్మి పథకంలో తన పేరు ఎందుకు తీసివేశారని అడిగిన మహిళను ఎమ్మెల్యే పరుష పదజాలంతో దూషించడం దారుణమని దామరచర్ల మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గాజుల శ్రీనివాస్ అన్నారు. కార్యక్రమంలో సుబ్బయ్య, గోపాల్, దాసు, సద్దాం, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తలకొప్పుల సైదులు మిర్యాలగూడలోని కాంగ్రెస్ కార్యాలయంలో మాట్లాడుతూ.. విజయకు క్షమాపణలు చెప్పకపోతే ఎమ్మెల్యేను గ్రామాల్లో తిరగనివ్వమని హెచ్చరించారు.

అహంకారానికి నిదర్శనం

మిర్యాలగూడ: తన సమస్యపై ప్రశ్నించిన మహిళపై ఎమ్మెల్యే భాస్కర్‌రావు అనుచిత వ్యాఖ్యలు చేయడం ఆయన అహంకారానికి నిదర్శనమని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. బుధవారం మిర్యాలగూడలోని సీపీఎం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. అధికార పార్టీ ఎమ్మెల్యేలు దురుసు ప్రవర్తన మానుకోకపోతే ప్రజలే బుద్ధి చెప్తారన్నారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేష్, జిల్లా కమిటీ సభ్యులు డాక్టర్ మల్లు గౌతంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీసీ సంఘాల ఆధ్వర్యంలో..

మిర్యాలగూడ టౌన్: ఎమ్మెల్యే అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ బుధవారం బీజేపీ ఆధ్వర్యంలో మిర్యాలగూడలో రాస్తారోకో నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు కంకణాల శ్రీధర్‌రెడ్డి, అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ బాణావత్ రతన్‌సింగ్‌నాయక్ తదితరులున్నారు. అదేవిధంగా బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మిర్యాలగూడ పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఎమ్మెల్యే దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో సంఘం ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షులు పాగుల సైదులు, రుషికేశ్వర్‌రాజు, తిరుమలగిరి అశోక్ తదితరులున్నారు. ఎమ్మెల్యే వ్యాఖ్యలను మిర్యాలగూడ అసెంబ్లీ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఎస్‌కే అజారుద్దీన్ ఖండించారు. విజయకు ఎమ్మెల్యే క్షమాపణ చెప్పాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ ఒక ప్రకటనలో కోరారు.

ఎమ్మెల్యే క్షమాపణ చెప్పాలి

మాడుగులపల్లి: ఎమ్మెల్యే భాస్కర్‌రావు క్షమాపణ చెప్పాలని బీసీ యువజన సంఘం జిల్లా కార్యదర్శి ఊరిబండి శ్రీనివాస్‌యాదవ్ డిమాండ్ చేశారు.

గిరిజన సంక్షేమానికి పెద్దపీట

పెద్దవూర: గిరిజన సంక్షేమానికి సీఎం కేసీఆర్ పెద్దపీట వేస్తున్నారని రాష్ట్ర గిరిజన ఆర్థిక సహకార సంస్థ చైర్మన్ ఇస్లావత్ రాంచందర్‌నాయక్ అన్నారు. బుధవారం పెద్దవూర మండల కేంద్రంలో జెడ్పీటీసీ అబ్బిడి కృష్ణారెడ్డితో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. మండల కేంద్రంలో పలు అభివృద్ధి పనులకు ఈ నెల 6న మంత్రులు సత్యవతిరాథోడ్, గుంటకండ్ల జగదీష్‌రెడ్డి శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా హాలియాలోని లక్ష్మీనర్సింహా ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించనున్న బహిరంగ సభకు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం మినీ గురుకులం, ఎస్టీ గురుకుల కళాశాలలను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ గుంటుక వెంకట్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జటావత్ రవినాయక్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌కు నివాళి

అడవిదేవులపల్లి: మండలంలోని చిట్యాల గ్రామ మాజీ సర్పంచ్ బొమ్మరబోయిన రామారావు మంగళవారం రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. ఈ విషయం తెలుసుకున్న శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మిర్యాలగూడ ఎమ్మెల్యే నలమోతు భాస్కర్‌రావు, రాష్ట్ర ఆగ్రోస్ చైర్మన్ తిప్పన విజయసింహారెడ్డి, డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్, కుందూరు జైవీర్‌రెడ్డి, ఆంధ్రప్రదేశ్‌లోని మాచర్ల నియోజకవర్గ వైసీపీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, కాంగ్రెస్ పార్టీ మిర్యాలగూడ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బత్తుల లక్ష్మారెడ్డి తదితరులు బుధవారం గ్రామానికి చేరుకొని రామారావు భౌతిక కాయానికి నివాళులర్పించారు. అనంతరం రామారావు కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

హామీల అమలులో విఫలం

మాడుగులపల్లి: రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు దేవిరెడ్డి అశోక్‌రెడ్డి విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ మాడుగులపల్లి మండల కేంద్రంలో బుధవారం రైతు సంఘం నాయకులు ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో రైతు సంఘం మండలాధ్యక్షుడు దేవిరెడ్డి మల్లారెడ్డి, విద్యాసాగర్‌రెడ్డి, పుల్లెంల శ్రీకర్, రవి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ

హాలియా: మేడ్చల్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ నెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో పట్టణంలోని లక్ష్య హైస్కూల్ విద్యార్థి సాత్విక్ పాల్గొని విజయం సాధించినట్లు పాఠశాల చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. సాత్విక్‌ను పాఠశాల డైరెక్టర్లు బుధవారం అభినందించారు.

ముదిరాజ్‌లు ఐక్యంగా ఉండాలి

హాలియా: ముదిరాజ్ కులస్తులు ఐక్యంగా ఉండి హక్కులను సాధించుకోవాలని ముదిరాజ్ సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు వెలుగు రవి, పందిరి శ్రీనివాస్, పిడిగం నాగయ్య, కోట్ల సునితాదేవి పిలుపునిచ్చారు. బుధవారం హాలియా పట్టణంలో నిర్వహించిన ముదిరాజ్‌ల ఆత్మీయ సమ్మేళన సభకు వారు హాజరై మాట్లాడారు. ముదిరాజ్‌లను ప్రభుత్వం బీసీ–ఏలో చేర్చాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో సుమారు 30 నియోజకవర్గాల్లో ముదిరాజ్‌ల ఓట్లు అధికంగా ఉన్నప్పటికీ రాజకీయ పార్టీలు సీట్లు కేటాయించకపోవడం అన్యాయమేనన్నారు. బీసీ ఆర్థికసాయంలో ముదిరాజ్‌లకు చోటు కల్పించకపోవడం, ముదిరాజ్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శమని పేర్కొన్నారు. 8న హైదరాబాద్‌లో నిర్వహించే ముదిరాజ్ సింహగర్జన సభను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం హాలియా పట్టణ అధ్యక్షుడు పుట్ట దుర్గారావు, మెరుగు రామలింగయ్య, అవుతా సైదులు తదితరులు పాల్గొన్నారు.



సంక్షిప్త సమాచారం

లీగల్ ఎయిడ్ కౌన్సిల్‌గా మాడెం రాములు

దేవరకొండ: దేవరకొండ ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి కోర్టు లీగల్ ఎయిడ్ కౌన్సిల్‌గా బార్ అసోసియేషన్ న్యాయవాది మాడెం రాములు నియమితులయ్యారు. జిల్లా న్యాయమూర్తి, డిస్ట్రిక్ట్ లీగల్ సెల్ అథారిటీ చైర్మన్ నాగరాజు రాములును ఎయిడ్ కౌన్సిల్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

అవకతవకలపై అధికారుల విచారణ

గుర్రంపోడు: మండలంలోని పిట్టలగూడెంలో చేపట్టిన అభివృద్ధి పనుల్లో అవకతవకలు జరిగాయని వచ్చిన అభియోగాలపై జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం గ్రామస్తుల సమక్షంలో క్వాలిటీ అధికారి చెన్నకేశవులు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు శ్రీనివాసరావు, రవికుమార్ విచారణ జరిపారు. గ్రామంలో పనులు చేపట్టకుండానే సర్పంచ్ బిల్లులు పెట్టి నిధులు డ్రా చేశారంటూ గ్రామస్తుడు ఉప్పరి కిరణ్ ఆరోపించారు. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని విచారణ అధికారులు తెలిపారు.

నిరంతరం విద్యుత్ ఇవ్వాలని ధర్నా

మిర్యాలగూడ అర్బన్: వ్యవసాయానికి నిరంతరం విద్యుత్ ఇవ్వాలని మిర్యాలగూడ మండలంలోని తక్కెళ్లపహాడ్ గ్రామంలో రైతులు బుధవారం ధర్నా చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయానికి 24గంటల ఉచిత కరెంట్ ఇస్తున్నామని చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో అది అమలు కావడం లేదని రైతులు అన్నారు. విద్యుత్ సరఫరా సరిగ్గా లేక వరి పొలాలు ఎండిపోతున్నాయని, లోవోల్టేజీతో మోటార్లు కాలిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

సిఫారసులు అమలు చేయాలి

పెద్దవూర: కమలేష్ చంద్ర కమిటీ సిఫారసులను అమలు చేయాలని ఆలిండియా గ్రామీణ డాక్ సేవకుల యూనియన్ మండల అధ్యక్షుడు ఎండీ. జానిమియా డిమాండ్ చేశారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ పెద్దవూర మండల కేంద్రంలోని తపాలా కార్యాలయం ఎదుట డాక్ సేవకులు ఒక్క రోజు సమ్మె నిర్వహించి మాట్లాడారు. గ్రామీణ డాక్ సేవకులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జీడీఎస్‌లు మల్లిక, మాధవి, అనంతరామశర్మ, సందీప్, లోకేష్, భానుమతి తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ కష్టాలపై స్పందించిన అధికారులు

కొండమల్లేపల్లి: ఒక చోట ఇవ్వాల్సిన పింఛన్ డబ్బులను మరొక చోట ఇస్తూ వృద్ధులను ఇబ్బందులకు గురిచేస్తున్న సబ్ పోస్ట్‌మాస్టర్ తీరుపై అధికారులు బుధవారం విచారణ చేపట్టారు. పత్రికల్లో వచ్చిన వార్తా కథనానికి స్పందించిన జిల్లా అధికారులు గుమ్మడవెల్లిలో విచారణ చేపట్టారు. డీఆర్‌డీఓ కాళిందిని పింఛన్‌దారులు, తపాలా ఉద్యోగుల నుంచి వివరాలు సేకరించారు. ఈ మేరకు విచారణ వివరాలను సీల్డ్ కవర్‌లో కలెక్టర్‌కు అందించనున్నట్లు తెలిపారు. ఆమె వెంట ఏపీడీ రవీందర్, ఎంపీడీఓ బాలరాజురెడ్డి, ఏపీఓ రామచంద్రనాయక్ తదితరులున్నారు.

సమస్యలు పరిష్కరించాలని ధర్నా

పెద్దవూర: తమ సమస్యలు పరిష్కరించాలని పెద్దవూర మండల కేంద్రంలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో పనిచేస్తున్న అకాడమిక్ ఇన్‌స్ట్రక్టర్ ఉపాధ్యాయులు బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ. షబ్బీర్ మాట్లాడుతూ.. అకాడమిక్ ఇన్‌స్ట్రక్టర్లను సీఆర్‌టీలుగా గుర్తించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, సీఆర్‌టీలకు వర్తింపజేసిన జీఓ 60ను తమకు వర్తింపజేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బి. కృష్ణ, సంధ్య, డి. శ్రీనునాయక్, డి. సైదులు, కె. రాంరెడ్డి, షాహీన్‌బేగం, శాంతి, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

నాగార్జునసాగర్‌లో శిక్షణ తరగతులు

నాగార్జునసాగర్: ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) నియోజకవర్గాల ఇన్‌చార్జిలకు ఈ నెల 13, 14, 15 తేదీల్లో సాగర్‌లోని యూత్ హాస్టల్‌లో పార్టీ రాష్ట్ర ఎలక్షన్ ఇన్‌చార్జి, ఢిల్లీ ఎమ్మెల్యే సోమనాథ్ భారతి రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు పార్టీ రాష్ట్ర కన్వీనర్ దొడ్డి సుధాకర్ బుధవారం తెలిపారు.

బీఎస్పీతోనే బహుజన రాజ్యాధికారం

దేవరకొండ: బహుజన సమాజ్ పార్టీ(బీఎస్పీ)తోనే బహుజన రాజ్యాధికారం సాధ్యమని పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్మేందర్ అన్నారు. బీఎస్పీ దేవరకొండ ఎమ్మెల్యే అభ్యర్థిగా వెంకటేశ్ చౌహాన్‌ను పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ మంగళవారం ప్రకటించారు. దీంతో బుధవారం పట్టణంలో బీఎస్పీ నాయకులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు ఊదరి సైదులు తదితరులు పాల్గొన్నారు.